3 నుంచి పోలియో చుక్కలు



సాక్షి, మేడ్చల్ జిల్లా: వచ్చేనెల 3వ తేదీ నుంచి 6 వరకు 0–5 సంవత్సరాలలోపు చిన్నారులకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించి పోలియో రహిత సమాజాన్ని నిర్మించాలని మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్ వీసీ హాల్‌లో ఏర్పాటు చేసిన జిల్లా టాస్క్‌ఫోర్స్ సమన్వయ సమావేశంలో ఆయన మాట్లాడుతూ వచ్చేనెల 3న బూత్‌స్థాయిలో పోలియో చుక్కలు వేయడం జరుగుతుందన్నారు. 4 నుంచి 6 వరకు ఇంటింటికీ వెళ్లి ఆశా వర్కర్లు పోలియో చుక్కలు వేస్తారన్నారు. పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. హైరిస్క్ ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. హైరిస్క్ ప్రాంతాలైన మురికివాడలు, సంచార జాతులు, ఇటుక బట్టీలు, నిర్మాణ స్థలాల్లో నివసిస్తున్న ప్రాంతాలను గుర్తించి అక్కడ పోలియో బూత్‌లను ఏర్పాటు చేయాలని తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పల్స్ పోలియో కేంద్రాలను ఏర్పాటు చేయాలన్నారు. పల్స్ పోలియో చుక్కలు వేసేందుకు విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రఘునాథ స్వామి, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి సరస్వతి, శిశు సంక్షేమ అధికారి కృష్ణారెడ్డి, వైద్యాధికారులు, జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

27న జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం

సాక్షి, మేడ్చల్ జిల్లా: జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం కార్యక్రమాన్ని ఈ నెల 20 నుంచి 27వ తేదీకి వాయిదా వేసినట్లు డీఎంహెచ్‌ఓ డాక్టర్ టి.రఘునాథ్ స్వామి తెలిపారు. పరిపాలనా కారణాల వల్ల ఈ కీలకమైన కార్యక్రమాన్ని వాయిదా వేయాలని వైద్యారోగ్యశాఖ ఉన్నతాధికారులు నిర్ణయం తీసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. 01–19 సంవత్సరాల మధ్య వయస్సు గల పిల్లలకు నులిపురుగులను నిర్మూలించే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఈ మార్పును గమనించి సంబంధిత జిల్లా ప్రజలు, అధికారులు, ఉద్యోగులు సహకారం అందించాలని ఆయన అభ్యర్థించారు.

ప్రజావాణి అర్జీలను త్వరగా పరిష్కరించాలి

సాక్షి, మేడ్చల్ జిల్లా: ప్రజావాణిలో అందిన ఫిర్యాదులను ప్రత్యేక శ్రద్ధతో సత్వరమే పరిష్కరించాలని మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ అన్నారు. ఎప్పటి ఫిర్యాదులను అప్పుడే పరిష్కరిస్తే పని సులభమవుతుందని సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డితో కలిసి ఆయన ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ప్రజావాణిలో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజలు 184 అర్జీలను కలెక్టర్‌తో సహా సంబంధిత జిల్లా అధికారులకు అందజేశారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ హరిప్రియ, వివిధ శాఖల జిల్లా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభం



నాగారం ఓల్డ్‌విలేజ్‌లో బీటీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్ చంద్రారెడ్డి

కీసర: నాగారం మున్సిపాలిటీలోని వివిధ వార్డుల్లో అభివృద్ధి పనుల కోసం పెద్ద ఎత్తున మున్సిపల్ నిధులను కేటాయిస్తున్నామని మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి అన్నారు. మున్సిపల్ పరిధిలోని ఓల్డ్‌విలేజ్‌లో సుమారు రూ.10 లక్షలతో చేపట్టనున్న బీటీ రోడ్డు పనులతో పాటు వెంకట్‌రెడ్డినగర్ కాలనీలో మరో రూ.5 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులను సోమవారం ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ బండారి మల్లేష్‌యాదవ్, కౌన్సిలర్లు అన్నంరాజు లావణ్యశ్రీనివాస్, పంగ హరిబాబు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.


100 శాతం ఇంటి పన్ను వసూలు చేయాలి



సమావేశంలో మున్సిపల్ కమిషనర్ రాజేంద్రకుమార్

కీసర: నాగారం మున్సిపాలిటీలో 2023–24 ఆర్థిక సంవత్సరానికి 100 శాతం ఇంటి పన్నులు, ట్రేడ్ లైసెన్స్, వసూలు చేయాలన్న లక్ష్యంతో ముందుకెళ్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ రాజేంద్రకుమార్ అన్నారు. మున్సిపల్ కార్యాలయంలో సోమవారం మున్సిపల్ వార్డు ఆఫీసర్లు, బిల్‌కలెక్టర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇంటి బకాయి ఉన్న వారికి రెడ్‌నోటీస్ జారీ చేయాలని ఆదేశించారు. అంతకుముందు మున్సిపల్ కమిషనర్ రాజేంద్రకుమార్, మున్సిపల్ పరిధిలోని వివిధ వార్డుల్లో కొనసాగుతున్న పారిశుద్ధ్య పనులు, పార్కులను పరిశీలించారు. పారిశుద్ధ్య నిర్వహణపై పలు సూచనలు చేశారు. మున్సిపల్ మేనేజర్ చంద్రశేఖర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రాంరెడ్డి, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఉచితంగా కంటి ఆపరేషన్లు



ఘట్‌కేసర్: ప్రతి ఒక్కరూ కళ్లను కాపాడుకోవాలని కంటి వైద్యనిపుణుడు కైసర్ మోహియుద్దీన్ అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో సోమవారం కంటి పరీక్షలు నిర్వహించారు. అనంతరం వైద్యుడు మాట్లాడుతూ కంటిచూపు కోల్పోతే జీవితం అంధకారం అవుతుందని, ప్రతి ఒక్కరూ కళ్లను కాపాడుకోవాలన్నారు. పేదలకు ఉచితంగా ఆపరేషన్లు చేయిస్తామన్నారు. కంటి పరీక్షల అనంతరం 55 మందికి ఆపరేషన్లు నిర్వహించేందుకు నానక్‌రామ్‌గూడలోని శంకర కంటి ఆస్పత్రికి బస్సులో తరలించారు. శిరీష, సలాం, రవి, సిరాజ్‌యుద్దీన్ పాల్గొన్నారు.

వీరత్వానికి ప్రతీక.. స్ఫూర్తి ప్రదాత..

ఛత్రపతి శివాజీ



మేడ్చల్‌లో బైక్ ర్యాలీలో సందీప్‌రెడ్డి తదితరులు



ఎస్‌ఎఫ్‌సీనగర్‌లో శివాజీ జయంతి వేడుకల్లో ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి

మేడ్చల్/మేడ్చల్‌రూరల్: ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి వేడుకలను మేడ్చల్, గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీల్లో, మండలంలోని వివిధ గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. టీవై జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సద్ది సందీప్‌రెడ్డి ఆధ్వర్యంలో యువకులు మేడ్చల్ మున్సిపాలిటీలోని ఎల్లమ్మ గుడి వద్ద నుంచి ప్రధాన వీధుల మీదుగా కేఎల్ఆర్ ఫేజ్–2లోని శివాజీ విగ్రహం వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. గిర్మాపూర్‌లో బీజేపీ, కాంగ్రెస్, బీఆర్‌ఎస్ నాయకులు, యువకులు శివాజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కేఎల్ఆర్ వెంచర్‌లోని శివాజీ విగ్రహం వద్ద నిర్వాహకులు మధ్యాహ్నం అన్నదానం, సాయంత్రం భారీ ర్యాలీ నిర్వహించారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలో కౌన్సిలర్లు, వివిధ పార్టీల నాయకులు ఛత్రపతి శివాజీ చిత్రపటానికి పూలమాలలు ఘనంగా నివాళులర్పించారు. మండలంలోని మునీరాబాద్ గ్రామంలోని శివాజీ విగ్రహానికి బీజేపీ జిల్లా అధ్యక్షుడు విక్రంరెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ మోహన్‌రెడ్డి, మాజీ సర్పంచ్ శ్రీనాథ్‌రెడ్డి, నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పూడూర్ గ్రామంలో శివాజీ యూత్ సభ్యులు గ్రామంలో ర్యాలీ నిర్వహించగా గ్రామ మాజీ సర్పంచ్ బాబు యాదవ్ పాల్గొన్నారు.

ఎస్‌ఎఫ్‌సీనగర్‌లో..

ఘట్‌కేసర్: హిందూ సామ్రాట్ ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి వేడుకలను సోమవారం ఎస్‌ఎఫ్‌సీనగర్‌లో నిర్వహించారు. ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై శివాజీ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో మహిపాల్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, నరేశ్, వీరేశ్, మధుసూదన్‌రెడ్డి, లక్ష్మణ్, జైపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎస్‌ఎస్‌యూఐ ఆధ్వర్యంలో..

పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో ఛత్రపతి శివాజీ మహరాజ్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఎన్ఎస్‌యూఐ మండల కార్యదర్శి శివాజీ నాయక్, ప్రసాద్, నాగరాజ్, అజయ్, వినోద్, వరుణ్ పాల్గొన్నారు.



గిర్మాపూర్‌లో నివాళులర్పిస్తున్న కౌన్సిలర్, వివిధ పార్టీల నాయకులు



మునీరాబాద్‌లో నివాళులర్పిస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు విక్రంరెడ్డి



చెంగిచర్లలో నిర్వహించిన ర్యాలీలో కాంగ్రెస్ రాష్ట్ర నేత వజ్రేష్‌యాదవ్

పారదర్శకంగా ఓటర్ల నమోదు ప్రక్రియ

సాక్షి, మేడ్చల్ జిల్లా: ఓటర్ల నమోదు ప్రక్రియను పారదర్శకంగా నిర్వహిస్తున్నట్లు మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో సోమవారం కలెక్టరేట్ నుంచి ఆయన వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌రాజ్‌తో మాట్లాడారు. ఎన్నికల సంఘం ఆదేశాలకు అనుగుణంగా పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించిన కార్యక్రమాలను సజావుగా జరిగేలా చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌రాజ్ వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతూ బీఎల్‌వోలను ఎప్పటికప్పుడు పరిశీలించాలని జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న ఫార్మ్‌లను పూర్తి చేయాలన్నారు. 18–19 ఏళ్ల ఓటర్ల నమోదు ప్రక్రియ పారదర్శకంగా ఉండాలని అన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, డీఆర్‌ఓ హరిప్రియ, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

స్టోన్ క్రషర్లపై ప్రజావాణిలో ఫిర్యాదు

మేడ్చల్‌రూరల్: మండలంలోని బండమాదారం గ్రామంలోని స్టోన్ క్రషర్ల నుంచి కంకర రవాణా టిప్పర్ వాహనాలు ఓవర్‌లోడ్‌తో వెళ్తుండటంతో తమకు ఇబ్బందులు కలుగుతున్నాయని గ్రామస్తులు సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. గ్రామ పరిధిలో ఉన్న క్రషర్ల నుంచి ఇతర ప్రాంతాలకు స్టోన్ తరలించే క్రమంలో టిప్పర్లలో సామర్థ్యానికి మించి ఓవర్‌లోడ్ సరఫరా చేస్తుడటంతో గ్రామంలో, రోడ్డులో వెళ్లే టిప్పర్ల నుంచి కంకర రోడ్డుపై పడటంతో ద్విచక్ర వాహనదారులు, ప్రయాణికులు ప్రమాదాల బారిన పడుతున్నారని, రోడ్లు దెబ్బతింటున్నాయని ఫిర్యాదు పేర్కొన్నారు. పలుమార్లు క్రషర్ల యజమానులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు.

లిక్కర్ మార్ట్‌ను తొలగించాలంటూ మహిళల ఆందోళన



బోడుప్పల్ మున్సిపల్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న మహిళలు

బోడుప్పల్: సిద్దార్థ స్కూల్ ఎదురుగా ఏర్పాటు చేసిన శ్రీసింధూర వైన్స్ లిక్కర్ మార్ట్‌ను అక్కడి నుంచి తొలగించాలని కోరుతూ సోమవారం బోడుప్పల్ నగర పాలక సంస్థ కార్యాలయం ఎదుట మహిళలు ఆందోళన చేపట్టారు. పీర్జాదిగూడ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు దర్గ దయాకర్‌రెడ్డి వారికి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా మహిళలు కమిషనర్ బయటకు వచ్చి తమకు న్యాయం చేయాలంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా మహిళలు మాట్లాడుతూ జనావాసాల మధ్య లిక్కర్ మార్ట్ ఏర్పాటు చేసి ప్రజలకు ఇబ్బందులు కలుగజేస్తున్నారన్నారు. వెంటనే అక్కడి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. లేదంటే పోరాటాన్ని ఉధృతం చేస్తామన్నారు. అనంతరం కమిషనర్ రామలింగం శ్రీసింధూర వైన్స్ లిక్కర్ మార్ట్‌ను సందర్శించారు. అనుమతి లేకుండా నిర్మించిన షెడ్‌ను తొలగిస్తామని, రెండు రోజుల సమయం కావాలని మహిళలను కోరారు. దీంతో మహిళలు ఆందోళన విరమించి అక్కడ నుంచి వెళ్లి పోయారు.

15వ డివిజన్‌లో సమస్యలు పరిష్కరించాలంటూ వినతి

బోడుప్పల్: 15వ డివిజన్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బీఆర్‌ఎస్ డివిజన్ ఇన్‌చార్జి సిగురు రేణుక రవికుమార్ సోమవారం మేయర్, కమిషనర్‌కు వినతి పత్రం అందజేశారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. నాలుగు నెలల క్రితం మల్లారెడ్డి మంత్రి హోదాలో 15వ డివిజన్‌లో రూ.6 కోట్లతో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారన్నారు. వాటిలో కొన్ని పనులు ఇప్పటికీ ప్రారంభం కాలేదన్నారు. బొల్లిగూడ చౌరస్తా నుంచి జలమండలి కార్యాలయం రోడ్డు, బొల్లిగూడ హనుమాన్ దేవాలయం నుంచి టెలిఫోన్ కాలనీ వినాయక మండపం రోడ్డు పనులు ప్రారంభం కాలేదన్నారు. డివిజన్‌లోని కొన్ని కాలనీల్లో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ లేక స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. అలాగే కాలనీల్లో కుక్కల బెడద తీవ్రంగా ఉందని, కమిషనర్ రామలింగం, మేయర్ బుచ్చిరెడ్డి స్పందించి సమస్యలను పరిష్కరించాలని ఆమె కోరారు. కాలనీల ప్రతినిధులు శంకర్, ప్రభాకర్‌రెడ్డి, అంజయ్య, ఆరోగ్య మేరి, గుత్తి శంకర్ పాల్గొన్నారు.

పౌర హక్కుల నేతపై దాడి

కుషాయిగూడ: ప్రభుత్వ స్థలంలో అక్రమంగా చేపడుతున్న నిర్మాణాన్ని అడ్డుకున్న పౌరహక్కుల నేత, న్యాయవాదిపై దాడికి పాల్పడ్డ ఘటన సోమవారం వెలుగులోకి వచ్చింది. మీర్‌పేట్–హెచ్‌బీకాలనీ డివిజన్, నవోదయనగర్, సర్వే నంబరు–24లో ఉన్న 60 గజాల స్థలంలో 2018లో ఇది ప్రభుత్వ స్థలమంటూ అధికారులు బోర్డు ఏర్పాటు చేశారు. ఆదివారం కాలనీకి చెందిన కొంతమంది స్థలంలో ఉన్న ప్రభుత్వ బోర్డును తొలగించి నిర్మాణం చేసేందుకు పనులు మొదలుపెట్టారు. దీనిని గమనించిన స్థానిక పౌరహక్కుల సంఘం నగర కమిటీ ఉపాధ్యక్షుడు, న్యాయవాది తాళ్లపల్లి లక్ష్మణ్ వారిని అడ్డుకున్నారు. దీంతో తుడుం నర్సింగరావు, కొడుకు శ్రావణ్, సుగుణమ్మలు అతడిపై దాడికి పాల్పడ్డారు. బాధితులు కుషాయిగూడ పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై పోలీసులను వివరణ కోరగా ఫిర్యాదు స్వీకరించి కోర్టు అనుమతి కోసం పంపినట్లు పేర్కొన్నారు. విషయం తెలిసిన రెవెన్యూ అధికారులు సోమవారం ఘటన స్థలాన్ని సందర్శించి తిరిగి ప్రభుత్వ స్థలమంటూ హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశారు. ఇదిలా ఉండగా న్యాయవాది లక్ష్మణ్‌పై దాడిని సికింద్రాబాద్ బార్ అసోసియేషన్ ప్రతినిధులు ఖండించారు. దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు.

బాలాజీ ఆలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠ

అల్వాల్: అల్వాల్‌లోని శ్రీబాలాజీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో నూతన ధ్వజస్తంభం పునః ప్రతిష్ఠ వైభవంగా ముగిసింది. సోమవారం చివరిరోజు విజయ సారథి ఆధ్వర్యంలో హోమం, నూతన ధ్వజస్తంభ ప్రతిష్ఠ కార్యక్రమంతో పాటు పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో ఆలయ ఫౌండర్ రాజాగోపాల్ సైంచార్, కార్యనిర్వాహణాధికారి మఠం వీరేశం, మాజీ కార్యనిర్వాహణాధికారి నరేందర్, దాతలు మూగ మధుసూదన్, మాధవి, మశస్విని, తేజస్విని, రాంమోహన్, శ్రీనవాస్, దేవేంద్రనాథ్, జేఏసీ నాయకులు సురేందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

కరెంటు ఉండని ప్రాంతాలు

మేడ్చల్: మెడిసిటి 33/11 కేవీ పరిధిలో విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల తొలగింపు కారణంగా పలు గ్రామాల్లో మంగళవారం విద్యుత్ అంతరాయం కలుగుతుందని ట్రాన్స్‌కో అధికారులు తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు మండలంలోని ఘనాపూర్, రాజబొల్లారం, ఘనాపూర్ తండా గ్రామాల పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

సీసీ రోడ్డు నిర్మించాలని వినతి



చైర్ పర్సన్, కమిషనర్‌కు వినతి అందజేస్తున్న కౌన్సిలర్ మల్లేశ్

ఘట్‌కేసర్: పట్టణంలోని మాధవరెడ్డి రైల్వే వంతెన నారాయణ గార్డెన్ నుంచి ఎదులాబాద్ రోడ్డు వరకు సీసీ రోడ్డు నిర్మించాలని మున్సిపల్ చైర్ పర్సన్ పావనీజంగయ్య, కమిషనర్ సాబేర్ అలీకి కౌన్సిలర్ మల్లేశ్ సోమవారం వినతి అందజేశారు. పట్టణంలో రైల్వే వంతెన పనులు సాగుతున్నందున వాహనాల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తున్నాయని వినతి పత్రంలో తెలిపారు.

కీసర ఆర్డీవోగా వెంకట ఉపేందర్‌రెడ్డి



కీసరగుట్ట స్వామిసేవలో పాల్గొన్న ఆర్డీవో వెంకట ఉపేందర్‌రెడ్డి

కీసర: కీసర ఆర్డీవోగా వెంకట ఉపేందర్‌రెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఉదయం కీసరగుట్టలో శ్రీరామలింగేశ్వరుడికి ప్రత్యేక పూజలు నిర్వహించిన వెంకటఉపేందర్‌రెడ్డి కీసర ఆర్డీవో కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఆయన గతంలో కీసర తహసీల్దార్‌గా పనిచేశారు.

ఇంటి ముందు పార్క్ చేసిన బైక్ చోరీ

మేడ్చల్‌రూరల్: ఇంటి ముందు పార్క్ చేసిన బైక్‌ను అర్ధరాత్రి దుండగులు ఎత్తుకెళ్లిన ఘటన మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. బాధితుల వివరాల ప్రకారం పట్టణంలోని ఇంద్రానగర్ కాలనీలో నివాసం ఉండే సాయికిరణ్‌రెడ్డి ఆదివారం రాత్రి ఇంటి ముందు తన ద్విచక్ర వాహనాన్ని పార్క్ చేశాడు. అర్ధరాత్రి గుర్తు తెలియని దుండగులు బైక్‌ను ఎత్తుకెళ్లారు. బైక్‌ను దొంగిలిస్తున్న దృశ్యాలు సీసీ కెమెరాల్లో రికార్డు అవ్వగా బాధితుడు మేడ్చల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

కీసర: రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందినట్లు కీసర పోలీసులు తెలిపారు. వివరాల్లోకి వెళ్లితే సుమారు 60 సంవత్సరాల వయస్సు ఉన్న వృద్ధుడిని ఆదివారం రాత్రి 9 గంటల సమయంలో నాగారం మున్సిపాలిటీ పరిధిలోని సత్యనారాయణ కాలనీ సమీపంలో గుర్తుతెలియని త్రిచక్ర వాహనం ఢీకొట్టింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడ్డ వృద్ధుడు మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు.

నిధులు మంజూరు చేయండి

అల్వాల్: మల్కాజిగిరి నియోజకవర్గంలోని మల్కాజిగిరి, అల్వాల్ సర్కిల్‌లు ఉన్నాయని, వాటి అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని కోరుతూ సోమవారం జీహెచ్‌ఎంసి కమిషనర్ రోనాల్డ్ రాస్‌కు ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి, అల్వాల్ డివిజన్ కార్పొరేటర్ చింతల శాంతి శ్రీనివాస్‌రెడ్డిలు వినతి పత్రం అందజేశారు.

యువతలో పెరుగుతున్న మానసిక ఆరోగ్య సమస్యలు

- మానసిక ఆరోగ్యంపై యువతకు అవగాహన కల్పించాలి
- సెంట్రల్ యూనివర్సిటీ సైకాలజీ విభాగం హెచ్‌ఓడీ పద్మజ



ఏయూ యూత్ వెల్నెస్ సదస్సులో మాట్లాడుతున్న ముఖ్యఅతిథి పద్మజ

ఘట్‌కేసర్: విద్యాసంస్థలలో మానసిక ఆరోగ్యంపై యువతకు అవగాహన కల్పించాలని సెంట్రల్ యూనివర్సిటీ సైకాలజీ విభాగం హెచ్‌ఓడీ పద్మజ అన్నారు. వెంకటాపూర్ అనురాగ్ యూనివర్సిటీ (ఏయూ), సైకాలజిస్టుల సంఘం ఏపీఏ ఇండియా సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన యూత్ వెల్నెస్ సదస్సుకు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు ఉద్వేగాలు ఎలా అదుపు చేసుకోవాలో శిక్షణ ఇవ్వాలన్నారు. ఏపీఏ ఇండియా నేషనల్ వర్కింగ్ ప్రెసిడెంట్ కృష్ణభరత్, సైకాలజిస్ట్ డాక్టర్లు వీరేందర్, విశేష్, శ్రీనివాస్ మాట్లాడుతూ నేటి యువతలో మానసిక సమస్యలు పెరుగుతున్నాయని, తల్లితండ్రులు, అధ్యాపకులు సూచనలివ్వాలన్నారు. కార్యక్రమంలో ఏపీఏ ఇండియా జాతీయ అధ్యక్షుడు రాజేశ్వర్‌రావు, ఉపాధ్యక్షుడు మోహన్‌పాండే, కార్యదర్శి రవి భార్గవ్, తెలంగాణ వర్కింగ్ ప్రెసిడెంట్ రేణుక, హైదరాబాద్ సంయుక్త కార్యదర్శి ఉషశ్రీ, ఏయూ స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ హెడ్ విష్ణువందన, ధనశ్రీనాయుడు, శివరాంప్రసాద్, కార్యదర్శి షర్మిల, సంతోశ్, విజయ, సుమ కవిత, మానస, ఏయూ అధ్యాపకులు పాల్గొన్నారు.

వేసవిలో నీటి సమస్య రాకుండా చర్యలు

మున్సిపల్ చైర్ పర్సన్ పావనీజంగయ్య



మాట్లాడుతున్న చైర్ పర్సన్ పావనీజంగయ్య

ఘట్‌కేసర్: రానున్న వేసవి కాలంలో మున్సిపాలిటీలో ప్రజలకు నీటి సరఫరాలో అంతరాయం కలగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని మున్సిపల్ చైర్ పర్సన్ పావనీజంగయ్య అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సోమవారం వాటర్ లైన్‌మెన్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మినీ మోటర్లు చెడిపోయి నీటి సరఫరాకు అంతరాయం కలిగిన పక్షంలో యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేపట్టి అందుబాటులోకి తేవాలని ఆదేశించారు. కార్యక్రమంలో కమిషనర్ సాబేర్ అలీ, వైస్ చైర్మన్ మాధవరెడ్డి, కౌన్సిలర్లు ఆంజనేయులు గౌడ్, అనురాధ, వాటర్ లైన్‌మెన్లు పాల్గొన్నారు.

నర్సింహారెడ్డి కళాశాలలో ఆన్‌లైన్ వర్క్‌షాప్

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని నర్సింహారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో క్లౌడ్ కంప్యూటింగ్, డేటా సైన్స్ అంశంపై వారం రోజుల పాటు నిర్వహించనున్న ఆన్‌లైన్ వర్క్‌షాప్ సోమవారం ప్రారంభమైంది. కార్యక్రమాన్ని ప్రారంభించిన కళాశాల కార్యదర్శి త్రిశూల్‌రెడ్డి మాట్లాడుతూ ప్రస్తుత కార్పొరేట్ ప్రపంచంలో ఎమర్జింగ్ టూల్స్ ముఖ్య పాత్ర పోషిస్తున్నాయన్నారు. భవిష్యత్‌లో క్లౌడ్ కంప్యూటింగ్, డేటా సైన్స్ పాత్ర ఎంతో కీలకంగా మారనుందని వివరించారు. వీటిపై అధ్యాపకులకు శిక్షణ ఇవ్వడం సంతోషకరం అన్నారు. అనంతరం వర్క్‌షాప్‌లో ప్రిన్సిపాల్ లోకనాథం, డీన్ రామసుబ్బారెడ్డి, పలు విభాగాల హెచ్‌ఓడీలు సుజిత్, పార్థసారథి, నాగేశ్వర్‌రావు, శ్రీదివ్య పలు అంశాలపై ప్రసంగించారు. శిక్షణ కార్యక్రమానికి 16 రాష్ట్రాల నుంచి 927 మంది రిజిస్ట్రేషన్ చేసుకున్నారని, 600 మందికి శిక్షణ ఇవ్వనున్నట్లు కన్వీనర్ దిలీప్‌కుమార్‌రెడ్డి, శ్రీనివాస్ తెలిపారు.

లాంగ్ డ్రైవ్ కార్ల కేసులో 8 మంది అరెస్టు

- చర్లపల్లి జైలుకు తరలించిన పోలీసులు
- ప్రధాన నిందితుడి కోసం గాలింపు

మేడిపల్లి: మేడిపల్లిలోని లాంగ్ డ్రైవ్ కార్ల కంపెనీ ఉద్యోగులపై యాజమాన్యం దాడిచేసి గాయపరిచిన ఘటనలో ఎనిమిది మంది నిందితులను సోమవారం చర్లపల్లి జైలుకు తరలించినట్లు మేడిపల్లి పోలీసులు తెలిపారు. తమ మాట వినని ఉద్యోగులను చిత్రహింసలకు గురిచేసిన ఘటనపై ప్రజలు పెద్దఎత్తున ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే రంగంలోకి దిగిన పోలీసులు కేసు నమోదు చేసుకొని నిందితులను జైలుకు తరలించారు. తప్పించుకుని తిరుగుతున్న ప్రధాన నిందితుడు కొప్పుల హరిదీప్‌రెడ్డిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేసి అతడితో పాటు మరికొందరి కోసం తీవ్రంగా గాలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. త్వరలోనే వారిని కూడా అరెస్టు చేస్తామని మేడిపల్లి పోలీసులు తెలిపారు.

ప్రజావాణిలో సమస్యల వెల్లువ



అల్వాల్ ఉపకమిషనర్‌కు వినతి పత్రం అందజేస్తూ..

అల్వాల్: అల్వాల్ సర్కిల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో పలు సమస్యలపై దరఖాస్తులను స్వీకరించినట్లు ఉపకమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. సర్కిల్ పరిధిలోని గంగ ఎన్‌క్లేవ్ కాలనీ వారు పార్కు అభివృద్ధి, డ్రైనేజీ వ్యవస్థను మెరుగు పర్చాలని, అల్వాల్‌లో ఉన్న జేఏసీ ప్రాంగణంలో వాటర్ క్యాంపునకు మంచినీటి ట్యాంకరు ద్వారా నిత్యం నీటి సరఫరా చేయాలని జేఏసీ నాయకులు సురేందర్‌రెడ్డి ఉపకమిషనర్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో శ్రీకాంత్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, సురేష్, రెహమాన్, విష్ణు తదితరులు ఉన్నారు.